క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం



ఊరేగింపునకు బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ జట్టు గెలవాలని చండీ హోమం

శ్రీకాళహస్తి: భారత క్రికెట్ జట్టు వరల్డ్ కప్ సాధించాలని కోరుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపుతున్న భారత్ తుదిపోరులో విజయం సాధించి కప్పు కై వసం చేసుకోవాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు గాయపడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన కిషోర్‌కుమార్(30) ద్విచక్ర వాహనంలో తిరుపతి బయలుదేరాడు. సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించాలని, బహిరంగ మల విసర్జన మానుకోవాలని ప్రజా ప్రగతి ట్రస్టు కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు, తదితర పంచాయతీల పరిధిలోని పలు గిరిజన కాలనీల్లో ఆదివారం మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎర్రగుడిపాడు ఎస్టీకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన చేయడం అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. సురక్షితమైన ఆరోగ్యానికి మరుగుదొడ్ల వినియోగమే శ్రేయస్కరమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి, ఆరోగ్య కార్యకర్త వాణి పాల్గొన్నారు.

కొల్హాపురి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నింద్ర: స్థానిక బీసీ కాలలో వెలసిన గ్రామ దేవత కొల్హాపురి అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. అనంతరం గ్రామంలో ఉరేగించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



పంటను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పొలసముదం: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని డీపీఎం వాసు తెలిపారు. ఆయన ఆదివారం క్రిష్ణజమ్మాపురంలో రైతులు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలించారు. వేరుశనగ పంట యూనివర్సల్ మోడల్ వెరిఫై చేయడంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. కిచెన్ గార్డెన్ సూర్య మండలం మోడల్ విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి



కృష్ణమ్మ (ఫైల్)

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కృష్ణమ్మ(70) అనే వృద్ధురాలు చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. ఈ నెల 13వ తేదీన ఇంట్లో దీపం పెడుతూ ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో ఆమె గాయపడింది. భర్త పురుషోత్తంనాయుడు ముందుగా ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లారు.ఈ క్రమంలో కృష్ణమ్మ మరణించింది. ఎస్‌ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన గురుకుల కళాశాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- గురుకుల కళాశాలలో ఘనంగా ఆదివాసీ మహోత్సవం



కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగకాలనీలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఆదివారం అంతర్జాతీయ ఆదివాసీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ, గిరిపుత్రులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. పేదలకు ఉత్తమ విద్య అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తపిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలోని పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారాయన్నారు. ఇదే గిరిజన పాఠశాలలో చదివిన కీర్తి ఎస్ఐగా, శైలజ అనే విద్యార్థిని వైద్యురాలిగా ఉన్నత స్థానాలకు వెళ్లారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. అందుకు కావాల్సిన సదుపాయాలను తాను ప్రభుత్వం తరఫున కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్ జరుగుతున్నా.. గిరిపుత్రికల్లో ఉత్సాహాన్ని నింపేందుకే తాను ఈ సమావేశానికి హాజరైనట్టు పేర్కొన్నారు. గిరిజన పాఠశాల భవనం పక్కన మరో భవనం కేటాయిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన కొత్తలో ఇక్కడ మరుగుదొడ్లు చిన్నవిగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నట్టు ఒక విద్యార్థిని తెలిపిందన్నారు. వెంటనే తాను పరిశీలించి రూ.10 లక్షలు మంజూరు చేసి మరుగుదొడ్లతోపాటు ప్రహరీ గోడ నిర్మించినట్టు వివరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో గిరిజనుల నాయకుడు చందమామల కోటయ్య చెంచమ్మ గుడి నిర్మించాలని కోరారని, పరిశీలించి సాయం చేస్తామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గిరిపుత్రికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరిజనులకు శివరాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గొడుగుచింత గోవిందయ్య, చందమామల కోటయ్య, శెట్టిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జంగం కులస్తులను ఆదుకుంటాం



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని జంగం కులస్తులను ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం నియోజకవర్గ జంగం సంక్షేమ సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ జంగం కుటుంబాలకు చెందిన పేద మహిళలకు ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. అంతే కాకుండా పట్టణంలో కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జంగం కులస్తులకు ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని తెలిపారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, ప్రకాష్‌యాదవ్, హరినాయుడు, శివయాదవ్, సుబ్బరాయులు, కారణి సుబ్రమణ్యం, ఉదయ్‌కిరణ్, చెంగయ్య, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.70 లక్షలతో దుకాణ సముదాయం నిర్మాణం



భూమిపూజ చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధంగా చెన్నై రోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం దుకాణ సముదాయానికి పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో సుమారు రూ.70 లక్షలతో పది గదులతో దుకాణ సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పవన్‌కుమార్, బాలాజీ, కాంట్రాక్టర్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌ముదిరాజ్, పీఎం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: ఈ నెల 21న జరగనున్న సూళ్లూరుపేట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన సభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాల్లోని ప్రజలు సీఎం సభకు తరలి రావడానికి అవసరమైన ఏర్పాట్లను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రజలు సీఎం సభకు స్వచ్ఛందంగా రావడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసే బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తీసుకోవాలన్నారు. తద్వారా సత్యవేడు నియోజకవర్గం నుండి సభకు భారీగా ప్రజలు వచ్చేలా చూడాలని ఆయన కోరారు.

నూతన ఈవోకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన కేఎస్ రామారావును పలువురు సన్మానించారు. ఆలయంలోని పరిపాలన భవనం వద్ద పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. బదిలీ అయిన ఈవో సాగర్‌బాబును కూడా సన్మానించారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ క్షేత్ర పరిరక్షణ సమితి సభ్యులు కూడా ఈవోను సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, గణేష్, నాగరాజుశెట్టి, రాధాకృష్ణ, స్వర్ణమూర్తి, మోహన్, భారతి, శ్రీరాములు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ కుటుంబానికి సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువనేస్తం అసోసియేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి: మండలంలోని రామలింగాపురం ఎస్టీ కాలనీకి చెందిన వికలాంగ కుటుంబానికి ఆదివారం యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ రామలింగాపురం ఎస్టీకాలనీలో నివాసం ఉండే బత్తెయ్య, రమణమ్మ వికలాంగులని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్టు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పేదవారికి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రావణి, నాగమణి, వెంకటేష్, హేమ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీపల్లికొండేశ్వర స్వామివారి సేవలో జేసీ



జాయింట్ కలెక్టర్‌కు ఆలయ మర్యాదలు చేస్తున్న చైర్మన్, అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం తిరుపతి జాయింట్ కలెక్టరు డి.కె.బాలాజీ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికి, స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ప్రదోష మండపంలో ఆలయ అర్చకులతో వేదమంత్రాల నడుమ ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని కలెక్టరుకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: మండలంలోని అక్కుర్తి దళితవాడలో సీతారాముల ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఇందులో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీ ప్రభాకర్, శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఏలయ్య, పుష్ప, శ్రావణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జానీబాషా, విజయశేఖర్, నాగూరయ్య, గోపి, శివయ్య, ఆర్ముగం, వాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం



దివ్యారామంలో కార్తీక వనభోజన మహోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లాలోని తోట కుటుంబాల వారి కార్తీక మాస వనభోజన మహోత్సవ పూజా కార్యక్రమం ఆదివారం దివ్యారామంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని తోట కుటుంబీకులు అందరూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. నామ గోత్రాలతో తులసి, ఉసిరి మొక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం నిర్వహించారు. తోట వారి ఇలవేల్పు శ్రీభువనేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సౌభాగ్య వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు స్వామి గిరీష్, తోట వారి కార్తీక వనభోజన మహోత్సవం ఆహ్వాన కమిటీ సభ్యులు తోట జయరాం, తోట వీర మనోహర్, రాంసాయి, అమరనాథ్, బాలాజీ, చలం, జయంతి, లోకేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పుత్తూరు: తిరుమలకుప్పంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పుత్తూరుకు చెందిన అన్నగౌరీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఇందులో స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, చర్మ, ఈఎన్‌టీ, ఎముకలకు సంబంధించి తిరుపతికి చెందిన స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామ్మూర్తి

పాకాల: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తకోట రామ్మూర్తి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రామ్మూర్తి గత 33 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా, సంఘం నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు ప్రభు, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య, యువరాజు, చంద్రశేఖర్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం



పూర్ణాహుతిలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం వేడుకగా నిర్వహించారు. అవివాహితులకు వివాహం జరగాలనే సంకల్పంతో ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున ఈ అమ్మవారి ఆలయంలో ఈ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం చేపట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని ప్రత్యేక హోమ మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి, అర్చక పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం పూర్ణాహుతిలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.గోపియాదవ్, ఈవో మమత, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేతలు పాలగిరి ప్రతాప్ రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం పనులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన పనుల గురించి తెలియజేశారు. ఆలయ పనులను ఆలస్యం లేకుండా నాణ్యతలో రాజీ లేకుండా చేపట్టాలని సూచించారు.

నేడు, రేపు ఉచిత శస్త్ర చికిత్సా శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20, 21వ తేదీల్లో తిరుపతి తాతానగర్‌లోని సుమన ఆనోరెక్టల్ ఆసుపత్రిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పైల్స్, ఫిస్ట్యులా వ్యాధులకు ఉచిత శస్త్ర చికిత్సా శిబిరం నిర్వహించనున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఎం.భాస్కర్‌రావు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పైల్స్, ఫిస్ట్యులా వ్యాధులు ఎలా వస్తాయి, రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన నివారణోపాయం, ఆహార నియమాలు వంటి వాటిపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కామోస్కోప్ యంత్రం ద్వారా పైల్స్ వ్యాధి నిర్ధారణ చేయడంతో పాటు అవసరమైన వారికి క్షారసూత్ర, క్షార కర్మ, అగ్నికర్మ విధానంలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల భద్రతకు పెద్దపీట



వరదయ్యపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గేటు



వరదయ్యపాలెం ప్రభుత్వ కార్యాలయాల వద్ద నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడ

వరదయ్యపాళెం: మండల ప్రభుత్వ కార్యాలయాల భద్రతకు ప్రస్తుత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. వరదయ్యపాళెంకు సమీపంలోని ఇందిరానగర్ వద్ద 2008లో నూతన ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటైంది. తహసీల్దార్, ఎంపీడీఓ, స్త్రీశక్తి, వ్యవసాయ శాఖలకు చెందిన కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. గతంలో తెలుగుగంగ కార్యాలయాలు ఉన్న ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ కార్యాలయాలకు రాత్రివేళల్లో భద్రత కరువైంది. సమీపంలో శ్మశానవాటిక ఉండడం, కార్యాలయ పనివేళల్లో శ్మశానవాటికలో జరిగే దహన సంస్కారాలు ప్రత్యక్షంగా వీక్షించలేక అధికారులు ఇబ్బందిపడేవారు. రాత్రివేళల్లో సైతం మందుబాబుల ఆగడాలతో కార్యాలయ ప్రాంగణంలో మద్యం బాటిళ్లు, ఇతరత్రా కార్యకలాపాలు జరిగేవి. కార్యాలయ అధికారులు స్థానిక ఇబ్బందులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దష్టికి తీసుకెళ్లారు. వారి విన్నపం మేరకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని ఎంపీపీని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ పద్మప్రియ ప్రత్యేక చొరవతో మండల నిధులు రూ.25 లక్షలతో మొదటి విడతగా మూడు వైపులా ప్రహరీ గోడ నిర్మాణ పనులను పూర్తి చేశారు. అలాగే అన్ని కార్యాలయాల ప్రవేశాల వద్ద గేట్లు ఏర్పాటు చేశారు. ప్రహరీ గోడ నిర్మాణంతో కార్యాలయాలు భద్రతా వలయంలో ఉన్నాయి. సాయంత్రం పనివేళలు పూర్తవ్వగానే గేట్లు వేసుకుని అధికారులు వెళ్తుండడంతో ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేదు.

కార్యాలయాల భద్రత ముఖ్యం



మండల ప్రభుత్వ కార్యాలయాల భద్రతకు పెద్దపీట వేశాం ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన రోజే ప్రభుత్వ కార్యాలయాలకు ప్రహరీ గోడ నిర్మించాలని సంకల్పించాం. కార్యాలయాలు ఏర్పాటై 15 సంవత్సరాలు పూర్తయినా ఏ ప్రభుత్వమూ స్పందించలేదు. ప్రస్తుత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశాలతో కార్యాలయాల భద్రత, అధికారుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకుని ప్రహరీ గోడ నిర్మించాం. పెండింగ్‌లో ఉన్న మరోవైపు గోడను సైతం రెండో దశలో నిర్మాణం చేశాం. – పద్మప్రియ, ఎంపీపీ, వరదయ్యపాళెం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీనృత్యాంజలి అకాడమీ ఆఫ్ మ్యూజికల్ డ్యాన్స్ నాట్య గురువులు సుబ్రమణ్యం, లక్ష్మీల ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం కార్యక్రమం ఆకట్టుకుంది. వివిధ పాటలకు కళాకారులు హర్షిత, మోక్షిత, పూర్వీఆజ్ఞా, సాత్విక, హృద్య, రక్షశ్రీ, శ్రీనిధి, కార్తీక, నిత్యప్రకాష్, జతిన్, జాశ్రిత, మాలిక, దాన్య, గురు నిశ్చల, దేదీప్య, ఓహోహాసినిల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.